ఒక్కడుగు ముందుకు.. నాలుగు వెనక్కు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణలో జాప్యం

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే క్రమబద్ధీకరణకు పునాది
- రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల సంయుక్త విచారణ
- హైడ్రా నేపథ్యంలో ముందుకు సాగని కార్యాచరణ
- లక్షా 20 వేల దరఖాస్తులలో విచారణ ఐదువేలే..



మేడ్చల్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నగర శివారులో లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల విచారణ ముందుకు సాగడం లేదు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, 34 గ్రామ పంచాయతీల పరిధిలో లక్షా 20 వేల దరఖాస్తులు వచ్చాయి. అనుమతి లేకుండా విక్రయించిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు వీలు కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. రూ. 1000 రుసుముతో ప్లాట్లు, రూ.10 వేల రుసుముతో వెంచర్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటిని క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. దీంతో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో దరఖాస్తుల విచారణను ప్రారంభించిన విషయం తెలిసిందే. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ చేస్తున్నారు.

హైడ్రా వల్లే దరఖాస్తుదారులు వెనకడుగు..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణలో దరఖాస్తుదారులు హైడ్రా వల్లే ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చినా అధికారుల వద్దకు రాకపోవడం వల్లే ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణ అంతగా ముందుకు సాగడం లేదని సమాచారం. ప్రస్తుతం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చెరువులు వద్దనున్న లే అవుట్‌ల వివరాలను సేకరిస్తున్న నేపథ్యంలో చెరువుల సమీపంలో ఉన్న లే అవుట్‌ల ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా విక్రయించిన క్రమంలో రెగ్యులరేజేషన్‌లో ఏమైనా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతో దరఖాస్తుదారులు విచారణకు ముందుకు రావడం లేదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే, ఎల్ఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తుల విచారణలో ప్రభుత్వ భూమి, చెరువు, బఫర్ జోన్, స్థానిక అవసరాలకు కేటాయించిన భూమి ఉంటే అనుమతులను నిరాకరించనున్నారు. దీంతో లే అవుట్ యజమానులతో పాటు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన ప్లాట్ల యజమానులు ముందుకు వెళ్లడం లేదని సమాచారం.

లక్షా 20 వేల దరఖాస్తులలో విచారించింది ఐదు వేలే...

జిల్లా వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు లక్షా 20 వేలు ఉంటే, ఇప్పటి వరకు విచారించింది ఐదువేల దరఖాస్తులు మాత్రమే. అయితే, మూడు నెలల్లో మిగతా దరఖాస్తుల విచారణ పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ ఇది సాధ్యమయ్యే పని కాదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులలో 75 శాతానికి పైగా దరఖాస్తులలో పూర్తి సమాచారం లేకపోవడంతో దరఖాస్తుదారుల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు వినియోగించుకోవడం లేదు. హైదరాబాద్ నగరంలో హైడ్రా తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ తరుణంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణలో దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదని స్వయంగా దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు.

సివిల్స్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 29: ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ సర్వీసెస్ అకాడమీలో యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షకు ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండ నాగేశ్వర్ మంగళవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో క్యాంపస్ కళాశాలల్లో పీజీ, పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులకు ఈ శిక్షణను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. దీని కోసం ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓయూ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి వివరాలతో నింపి తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. వచ్చే నెల 8వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని పిలుపునిచ్చారు. అత్యంత నాణ్యంగా బోధించబడే ఈ శిక్షణ తరగతులను ఓయూ విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

టీఆర్ఈఐటీఏ అధ్యక్షుడిగా సంజీవ

సిటీబ్యూరో, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): తెలంగాణ గురుకుల విద్యాలయ ఉపాధ్యాయ సంఘం (టీఆర్ఈఐటీఏ) అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక మంగళవారం జరిగినట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన కె.సంజీవ, కార్యదర్శిగా మహబూబ్‌నగర్‌కు చెందిన ఏ.పద్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా టి.భార్గవి, జి.సోమాని, ట్రెజరర్‌గా జి.సుమలతలు ఎన్నికయినట్టు తెలిపారు.

నాగోల్‌లో కియా కార్నివాల్‌ను ఆవిష్కరణ

సిటీబ్యూరో, అక్టోబరు 29(నమస్తే తెలంగాణ): నాగోల్‌లో ఏర్పాటు చేసిన ఆటోమోటివ్ కియా కార్నివాల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఆవిష్కరించారు. 75 ఏండ్లుగా కస్టమర్లకు సేవలందిస్తున్న ఆటోమోటివ్ గ్రూప్‌ను ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రశంసించారు. గత ఐదేండ్లుగా విజయవంతంగా కొనసాగుతున్న కియా మోటార్స్ విశిష్టమైన వినియోగదారుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

సిటీబ్యూరో, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో వాకథాన్ నిర్వహించారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ నేతృత్వంలో జరిగిన ఈ వాకథాన్‌లో అవినీతి, లంచగొండితనాన్ని వ్యతిరేకిస్తూ, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించేలా ప్లకార్డులను బ్యాంకు సిబ్బంది ప్రదర్శించారు. బ్యాంక్ స్టాఫ్, కస్టమర్లు, ప్రజలు ప్రతి విషయంలోనూ నిజాయితీగా పారదర్శకతతో ఉండాలని ధారాసింగ్ నాయక్ పిలుపునిచ్చారు. వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు చేపట్టామని, అదే విధంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించామని తెలిపారు. వాకథాన్‌లో డీజేహెచ్ కనకరాజు, హైదరాబాద్ రీజనల్ హెడ్ రామకృష్ణన్, డీజీఎం సురేశ్, ఏజీఎం సత్యవాణి, ఏజీఎం గుల్షన్ కుమార్, విజిలెన్స్ ఆఫీసర్ ముస్తఫా పాల్గొన్నారు.

భాస్కర్ లా కాలేజీలో ఓరియెంటేషన్ డే..

సిటీబ్యూరో, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): భాస్కర్ లా కాలేజీలో మంగళవారం లా మొదటి సంవత్సర విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హ్యూమన్ రైట్స్ కమిషనర్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యారు. కార్యక్రమంలో పీజీఆర్ఆర్‌సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్స్ జీబీ రెడ్డి, జేవీ కృష్ణారావు, సీహెచ్ సంజయ్ పాల్గొన్నారు. న్యాయ శాస్త్ర ప్రాధాన్యత, అవలంబించాల్సిన పద్ధతులపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ట్రాఫిక్ గాలికి.. వసూళ్లకు పరుగులు..

- నగరంలో ఎక్కడికక్కడే నిలుస్తున్న ట్రాఫిక్
- సమస్య పరిష్కారంపై ట్రాఫిక్ పోలీసుల దృష్టేది?

సిటీబ్యూరో, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): నగరంలో ట్రాఫిక్ జంక్షన్లు దాటేందుకు ఎదురు చూపులు తప్పడం లేదు. ట్రాఫిక్‌తో రోడ్లన్నీ రద్దీగా ఉన్నా, ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు రోడ్లపై ట్రాఫిక్ పోలీసులు మాత్రం కన్పించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అయితే, రోజువారీగా చలాన్లు వేయడం, వాటిని వసూలు చేయడమే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు పనిచేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కంటే, చలాన్లు వసూలు చేసే పనిలోనే ఎక్కువ మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు రోజువారీగా ఎక్కువ సమయం చలాన్ల వసూళ్లకే కేటాయిస్తున్నారు. దీంతోనే ఎక్కడి ట్రాఫిక్ అక్కడే జామ్ అవుతుంది. పగటి పూటనే కాదు, రాత్రి 11 గంటల వరకు నగరంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయినా కూడా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు మార్గాలను మాత్రం అధికారులు వెతకడం లేదు. రద్దీ వేళల్లో ఉన్నతాధికారుల నుంచి హోంగార్డు వరకు రోడ్లపై ఉండాల్సి ఉన్నా, పట్టించుకునే వారు లేరు. నిత్యం సెంట్రల్, వెస్ట్ జోన్, సౌత్ వెస్ట్, నార్త్ జోన్లలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే, ట్రాఫిక్ పోలీసులు సరైన ప్రణాళికలు లేకపోవడం, క్షేత్ర స్థాయిలో అధికారుల పరిశీలన కరువవ్వడంతో ఇప్పుడు సౌత్‌వెస్ట్, ఈస్ట్, సౌత్‌జోన్‌లలో జంక్షన్లు పూర్తిగా ట్రాఫిక్ రద్దీతో నిండిపోతున్నాయి. గతంలో చాలా జంక్షన్లు ట్రాఫిక్ సాఫీగా వెళ్లేది, నేడు అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో నగర వ్యాప్తంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్ ట్యాంక్, పంజాగుట్టతో పాటు సైబరాబాద్‌లోని పలు జంక్షన్లు దాటేందుకు నిమిషాల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు.

రోడ్లపైకి బయటకు రాని పరిస్థితి..!

ట్రాఫిక్‌లో కొందరు అధికారులు కార్యాలయాల నుంచి బయటకు రాకుండానే పనిచేస్తున్నారు. కొందరైతే క్షేత్ర స్థాయిలో ఏమి చేయాలి? ఏమి లోపాలున్నాయి? అనే విషయాన్ని కూడా పట్టించుకోకుండా ఉండటంతో తమ అధికారి అలానే ఉన్నాడు, మమ్మల్ని ఎవరు అడుగుతారనే భావనతో ట్రాఫిక్‌పై దృష్టి కూడా పెట్టడం లేదనే విమర్శలున్నాయి. ఇలా, ట్రాఫిక్‌లో చాలా మంది క్షేత్ర స్థాయిలో ఉంటూ ఎప్పకటిప్పుడు సమస్యలను పరిశీలిస్తూ పనిచేయాల్సి ఉండగా, మనవెవరు అడుగుతారు? అనే ధీమాతో రోడ్లపైకి కూడా రాకుండా పనిచేస్తుండటంతో నగర వాసులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసి తన కుమారుడి పెండ్లికి రావాలని శుభలేఖ అందజేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

జల మండలి ఎండీని కలిసిన టీజీవో నేతలు

సిటీబ్యూరో, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్, సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌లు మంగళవారం కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్యను, జల మండలి ఎండీ అశోక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా టీజీవోల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నేతలు కోరారు. ప్రభుత్వ పథకాల ఫలాలను సామాన్యులకు అందేలా టీజీవో కృషి చేస్తుందని ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్, సెక్రటరీ అబ్దుల్ ఖాదర్‌లు పేర్కొన్నారు.

స్థలం కేటాయింపు లేఖను వెనక్కి తీసుకోవాలి

అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల డిమాండ్

లంచ్ అవర్‌లో నిరసన చేస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్, అక్టోబర్ 29: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన 10 ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి ప్రభుత్వం కేటాయిస్తూ ఇచ్చిన లేఖను వెంటనే వెనక్కి తీసుకోవాలని యూనివర్సిటీ ఉద్యోగులు నిరసన తెలిపారు. యూనివర్సిటీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం (లంచ్ అవర్‌లో) చేపట్టిన నిరసనలో యూనివర్సిటీకి చెందిన అధ్యాపక, అధ్యాపకేతర, టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్ పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, ప్రొ. పుష్ప చక్రపాణి, డా. అవినాష్, డా. కిషోర్, డా. జి.అంబేద్కర్, డా. ప్రమీలా కేతావత్, డా. పరాంకుశం వెంకటరమణ, డా. రవీంద్రనాథ్ సోలమన్, ఎన్నీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

జనాభాతో పాటే కులగణన చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

రవీంద్రభారతి, అక్టోబర్ 29: 2025వ సంవత్సరంలో జాతీయ స్థాయిలో జనాభా గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినందున ఇందులో కులగణన కూడా చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ శీతాకాలం పార్లమెంట్ సమావేశాల్లోని బీసీ బిల్లు పెట్టి బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని చెప్పారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, కులగణన చేయాలని ఎన్డీఏ ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షాలు జనతాదళ్, టీడీపీ, అప్నాదళ్, రిప్లబిక్ అండ్ పార్టీ, లోక్ జనశక్తి పార్టీ తదితర ఇతర పార్టీలతో పాటు ఆర్ఎస్ఎస్ కూడా కులగణన చేయాలని డిమాండ్ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వామపక్షాలు, దేశంలోని ప్రజా సంఘాలు అన్ని కులగణన చేయాలని డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతో సహ అనేక రాష్ట్రాలలో కులగణన చేశారని తెలిపారు. సుప్రీం కోర్టుతో సహా అన్ని రాష్ట్రాల హైకోర్టులు దాదాపు 20 హైకోర్టులు కూడా కుల గణన చేయాలని తీర్పు వెలువరించాయన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గుజ్జ కృష్ణ, అంజి, లాల్‌కృష్ణ, రామకృష్ణ, నందగోపాల్, కోలా జనార్దన్, నందగోపాల్, గొరిగె మల్లేశ్ యాదవ్, పగిళ్ళ సతీశ్ పాల్గొన్నారు.

యశోదలో బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన

వరల్డ్ స్ట్రోక్ డేను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మస్తీపురం రమేశ్, యశోద హాస్పిటల్స్ గ్రూప్, డైరెక్టర్ డాక్టర్ గోరుకంటి పవన్, తదితరులు

మారేడ్‌పల్లి, అక్టోబర్ 29: వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డేను పురస్కరించుకొని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్రెయిన్ స్ట్రోక్ అవగాహన కార్యక్రమం జరిగింది. బ్రెయిన్ స్ట్రోక్ పేషెంట్లలో కొత్త చికిత్స విధానాలు, అందుబాటులో వచ్చిన సాంకేతికతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మస్తీపురం రమేశ్, యశోద హాస్పిటల్స్ గ్రూప్, డైరెక్టర్ డాక్టర్ గోరుకంటి పవన్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ రమేశ్ మాట్లాడుతూ, మద్యం తాగడం, పొగ తాగడం, దీర్ఘకాలిక వ్యాధులు, మధుమేహం, అధిక రక్తపోటు, స్థూలకాయం వంటి సమస్యల వల్ల పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వయస్సు పెరిగే కొద్ది క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం తప్పని సరి చేసుకోవాలన్నారు. ప్రధానంగా బ్రెయిన్ స్ట్రోక్ పట్ల అందరిలో మరింత అవగాహన రావడం ప్రధానమన్నారు. పక్షవాతం (బ్రెయిన్ స్ట్రోక్) అనేది మనిషికి తెలియకుండానే కుంగదీసే ప్రమాదకరమైన వ్యాధి అని, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందన్నారు. మహిళలతో పోల్చితే పురుషుల్లో పక్షవాతం ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. అనంతరం, యశోద హాస్పిటల్స్ గ్రూప్, డైరెక్టర్ డాక్టర్ గోరుకంటి పవన్ మాట్లాడుతూ, బ్రెయిన్ స్ట్రోక్ చికిత్స కోసం అత్యాధునిక ట్రీట్మెంట్ అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు. 'మెకానికల్ థ్రోంబెక్టమీ' అని పిలువబడే ఒక కొత్త చికిత్స అని, చాలా మంది రోగులను వైకల్యం, ప్రాణాపాయం నుంచి కాపాడుతుందన్నారు. మెదడుకు రక్తం సరఫరా నిలిచిపోయినప్పుడు స్ట్రోక్ సంభవిస్తుందని, ఫలితంగా మెదడు కణాలకు తాత్కాలిక లేదా శాశ్వత నష్టం జరుగుతుందని వివరించారు. అనంతరం, యశోద ఆసుపత్రి సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఆర్.ఎన్.కోమల్ కుమార్, తదితరులు మాట్లాడారు.

తెలుగు వర్సిటీ సంగీత, నృత్య కళాశాలల పరీక్ష ఫలితాలు విడుదల

దుండిగల్, అక్టోబర్ 29: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 13 ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలు, కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఈ ఏడాది జూలైలో నిర్వహించిన డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులకు వివిధ అంశాలలో నిర్వహించిన వార్షిక పరీక్షల ఫలితాలను మంగళవారం విశ్వవిద్యాలయం విడుదల చేసింది. బాచుపల్లిలోని యూనివర్సిటీ వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు ఫలితాలను ప్రకటిస్తూ ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు తమ ఫలితాలను తెలుగు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.teluguuniversity.ac.in అలాగే www.manabadi.co.in లలో కూడా వీక్షించవచ్చని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు.

సమగ్ర ఇంటింటి సర్వేను సమర్థవంతంగా చేపట్టాలి

- నిర్ణీత వ్యవధిలో సర్వే పూర్తి చేయాలి
- అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీశ్

సిటీబ్యూరో, అక్టోబరు 29(నమస్తే తెలంగాణ): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని, అందుకు సర్వే నిర్వహణ చేయడంపై ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు పూర్తి అవగాహన ఉండాలని అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీశ్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై డిప్యూటీ కమిషనర్లు, సర్కిల్ లెవల్ మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహ శబరీశ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవంబర్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం యొక్క సామాజిక, ఆర్థిక స్థితి, విద్యా స్థాయి, ఉపాధి పరిస్థితులు, రాజకీయ ప్రయోజనం కుటుంబం ఆర్థిక పరిస్థితి వివరణాత్మక సమాచారం సేకరించడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని, ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని ప్రజల జీవనస్థితి, అవసరాలు, సమగ్ర సమాచారం చేసి వాటి పరిష్కార మార్గాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఈ సర్వేను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సర్వే డేటా సేకరణలో అవలంబించాల్సిన నైతిక ప్రమాణాలు, వ్యక్తిగత గోప్యతా హక్కులను కాపాడటంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె సూచించారు.

అన్ని కుటుంబాల డేటా సేకరించాలి

సర్వే కోసం ఎన్యూమరేటర్స్‌ను, సూపర్ వైజర్స్‌ను నియమించుకోవాలని, ఎన్యూమరేటర్స్ సర్వే నిర్వహించి తమకు కేటాయించిన అన్ని కుటుంబాల డేటా సేకరించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలని స్నేహ శబరీశ్ పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ బ్లాకులలో అన్ని కుటుంబాలకు నమోదుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, ఎన్యూమరేటర్లు మార్గదర్శకాల మేరకు సర్వే నిర్వహించాలని తెలిపారు. సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్ వేయాలని సూచించారు. సూపర్ వైజర్లు ఎన్యూమరేటర్ సేకరించిన డాటాలో 10 శాతం ర్యాండం కుటుంబాలకు చెకప్ చేయాలన్నారు. ఎన్యూమరేటర్ పనితీరు పర్యవేక్షించి, సర్వే ప్రక్రియలో అవసరమైన మార్గదర్శకం, సహాయం అందించాలని సూచించారు.

సర్వేపై శిక్షణ..

హౌస్ హోల్డ్ షెడ్యూల్ సర్వే ఫారం, హౌస్ లిస్టింగ్ ఫారం, ఎన్యూమరేటర్ మార్గదర్శకాలు, స్టిక్కర్ తదితరాల గురించి ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ చంద్ర వివరించారు. శిక్షణలో భాగంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సర్వే ఏ విధంగా చేయాలి? ఫారం నింపే విధానం, ఇతర ముఖ్య వివరాలను సవివరంగా వివరించారు. మాస్టర్ ట్రైనర్స్‌కు సర్వే నిర్వహణ సంబంధిత పద్ధతులు, సాంకేతికతలు, ప్రామాణిక పద్ధతులు వివరించడంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సర్వే సమయంలో ఎదురయ్యే పలు సమస్యలు, వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం, సర్వే విషయమై పలువురు అడిగిన సందేహాలకు నివృత్తి చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు అలివేలు మంగతాయారు, సరోజ, జెడ్సీలు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ హన్, రవి కిరణ్, వెంకన్న, చీఫ్ ఆర్టికల్చర్ అధికారి సునంద, డీసీలు, పీఓలు, ఏఎంసీలు పాల్గొన్నారు.

పీఎన్‌బీ ఆధ్వర్యంలో వాకథాన్



సిటీబ్యూరో, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ): విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వాకథాన్ నిర్వహించారు. పీఎన్‌బీ హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జోనల్ హెడ్ దీపక్ కుమార్ శ్రీవాస్తవ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం, జోనల్ పరిధిలో బ్యాంకు సిబ్బంది సంజీవయ్య పార్క్ నుంచి వాకథాన్‌లో పాల్గొన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా బ్యాంక్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని శ్రీవాస్తవ తెలిపారు. ఈ వాకథాన్‌లో డిప్యూటీ జోనల్ మేనేజర్ సంజయ్ గోవిందరావు మానె, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ సుర్జీత్ కుమార్ ఝా, హైదరాబాద్ సర్కిల్ హెడ్ అరవింద్ కల్రా, జోనల్ ఆఫీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు వెంకటకృష్ణన్, సీబీ రావ్, వాసుదేవ్ రాయ్, శ్యామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళా క్షేత్రంలో అమరుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

గద్దర్ గళం వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లూరి సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

ఖైరతాబాద్, అక్టోబర్ 29: వరంగల్ జిల్లా కేంద్రంలోని హన్మకొండలో నిర్మిస్తున్న కళా క్షేత్రంలో తెలంగాణ సాధన కోసం అమరులైన కళాకారుల విగ్రహాలను ప్రతిష్టించాలని గద్దర్ గళం వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లూరి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. తమ కళలతో ప్రజలను చైతన్యం చేశారని ఆయన అన్నారు. తమ పాటల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ఊరూర ప్రచారం చేశారన్నారు. వారిని గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కళాక్షేత్రంలో అమరులైన కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ర్యాలీ చేసిన విద్యార్థులను అరెస్టు చేయడం విచారకరమన్నారు. అంతే కాకుండా నూతన కళాక్షేత్రానికి గద్దర్ పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, గద్దర్ గళం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పసునూరి రవీందర్, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.